



# శత్రువు

ఇంగ్లీషు మూలం
పెరల్ ఎస్. బక్

డాక్టర్ సదావొ హోకి తరచుగా పసితనంలో ఆడుకున్న జపాను సముద్ర తీరప్రాంతంలోనే అతని ఇల్లు ఉంది. ఒరిగిన పైన్ చెట్లవరుస ఆ సన్ననితీరం పొడవునా కనిపిస్తూ ఉంటే, ఒడ్డుకన్నా చాలా ఎత్తుగా ఉన్న బండలమీద, మరీ ఎత్తుగా లేని సమ చతురస్రాకారపు రాతి కట్టడ మది.

దక్షిణ సముద్రతీరంలో పెద్దవాళ్లు కొబ్బరికాయల కోసం చెట్లెక్కడం చూసి చూసి, ఏ తాడుగూ లేని పాదాలను గట్టిగా దాపుపెట్టి సదావొ పైన్ చెట్లే ఎక్కేసేవాడు.

దక్షిణ సముద్రంలోని దీవుల దిశగా తీసుకుపోయి, "అదిగో...ఆ కనిపిస్తున్న దీవులే మన జపాన్ దేశం ముందుకు సాగిపోవడానికి తొలిమెట్లు" అని తన తండ్రి పని కట్టుకుని హెచ్చరించేవాడు.

సదావొ అటువైపే గంభీరంగా చూస్తూ, "ఆ మెట్లమీంచి తర్వాత మనం ఇంకెక్కడికి అడుగువెయ్యాలి?" అని అడిగేవాడు.

"ఎవరు చెప్పగలరు? మన భవిష్యత్తుకి హద్దు లేమిటి....అంతా మన సాహసంమీద ఆధారపడి ఉంటుంది."

తన తండ్రి ఏది చెప్పినా ఎంత శ్రద్ధగా వినేవాడో, ఈ మాటలుకూడా అంత శ్రద్ధగా విన్నాడు. అసలు ఆ తండ్రి ఆషామాషీగా ఏదన్నా అంటేగదా!

ఒక్కగానొక్క కొడుకుని జాగ్రత్తగా పెంచుకున్నాడు. తండ్రి చూపంతా తన చదువుమీదే అని సదావొకి బాగా తెలుసును. అందుకే ఇరవైరెండేళ్ల ప్రాయంలోనే వైద్యశాస్త్రం, శస్త్రచికిత్సల్లో ఉన్నదంతా ఔపోసన పట్టిరావాలన్న కోరికతో కొడుకుని అమెరికా పంపిస్తే వెళ్లాడు. సరిగ్గా ముప్పైఏళ్ల వయసులో తిరిగి వచ్చేశాడుకూడా.

పేరు మోసిన సర్జన్‌గానే కాక వైద్యశాస్త్ర నిపుణుడుగాకూడా తన కొడుకుని చూసుకున్నాక మరీ కన్నుమూశాడు తండ్రి. గాయాల్ని పరిపూర్ణ రక్షణతో అతిశుభ్రంగా ఉంచే కొత్తపద్ధతిని శోధించి ఒక కొలిక్కి తేవడంలో నిమగ్నుడైపోయిన కారణంగా సదావొని సైన్యంతో దూరతీరాలు పంపకుండా స్థానికంగానే ఉంచారు. అదే కాదు; అతను మందిచ్చి చికిత్స చేస్తున్న ఓ ముసలి సైన్యాధికారి(జనరల్)కి ఏ క్షణాన్నయినా శస్త్రచికిత్స అవసర మయ్యేలా ఉంది. అతను ఆ కారణంగా జపాన్‌లోనే ఉండిపోయాడు.

000

సముద్రంలోంచి మబ్బులు రూపుదిద్దుకుంటున్నాయి. కొద్దిరోజులుగా అనుకోకుండా వచ్చివడ్డ ఉమ్మదంవల్ల కెరటాలమీంచి రాత్రి దట్టంగా పొగమంచు లేచి వ్యాపిస్తోంది. తీరానికి కాసింత దూరాన ఉన్న దీవి అంచుల్ని పొగమంచు తెర మూసివేస్తూ, నెమ్మదిగా ఇంటి ముంగిట నీళ్లదాకా వస్తూ పైన్

చెట్లను కప్పేస్తూ ఉంటే అలా అటు చూస్తున్నాడు. ఇంకో క్షణంలో తన ఇంటినికూడా అది చుట్టేస్తుంది. అప్పుడు గదిలోకి వెళ్లిపోతాడు. తన భార్య హనా, ఇద్దరు పిల్లలతో తన కోసం ఎదురుచూస్తూ ఉంటుంది.

సరిగ్గా అలాటి సమయంలో తలుపు తెరుచుకుంది. హనా బయటకు చూసింది. కిమొనో(తేలికపాటి గౌను)మీద గాఢపు నీలిరంగు ఉన్నికాలువ కప్పుకుని ఉంది. ప్రేమగా దగ్గరకు వచ్చి భర్తచేతితో తన చేతిని కలిపింది. నవ్వుతూ మాట లేకుండా నిలబడ్డాడు సదావొ.

హనాని అమెరికాలోనే చూశాడు. అయితే, జపాన్ యువతిగా నిర్ధారించుకున్నాక ప్రేమలో పడ్డాడు. నూటికి నూరుపాళ్లు జపాన్ యువతి అయితేనేతప్ప తండ్రి సరే అనేవాడు కాదుమరి. హనాని కలవకుండా ఉంటే ఎవరిని చేసుకుని ఉండేవాడినని తనలో తాను ప్రశ్నించుకుంటూ ఉంటాడు. అమెరికా దేశపు ప్రొఫెసర్ ఇంట అనుకోకుండా ఆమెను కలుసుకోవడం ఎంతటి అదృష్టం అనుకుంటాడు. ప్రొఫెసరూ, అతని భార్యా చాలా దయగలవారే. దగ్గర కొచ్చిన విదేశీ శిష్యులకు ఏదో మంచి చెయ్యాలి అనే తపన వాళ్లది. శిష్యులుకూడా చదువులో విసుగుదల ఉన్నా, ఈ అభిమానాన్ని స్వీకరించేవారు. ఆ ప్రొఫెసర్ పరిసరాలకు వెళ్లాలనే అనిపించేది కాదనీ, వసతి--చాలా ఇరుకు, భోజనం చూస్తే అంతంతమాత్రం, ఆయన భార్య పెద్దగా వాగే మనిషి అని సదావొ తరుచూ హనాతో అనేవాడు. అయినా, అలా వెళ్లడంవల్లనే కొత్త విద్యార్థిని హనాతో పరిచయం లభించి ఎలాగైనాసరే, పెళ్లి చేసుకోవాలని అన్నంతవరకూ ప్రేమ కొనసాగింది. వైవాహిక జీవితంలో ఇద్దరు పిల్లలు కలిగినా, ఇప్పటికీ ఆమె చెయ్యి తన చేతికి సోకగానే మనసు ప్రసన్నమై పోయింది. అమెరికాలో చూసిన వెంటనే పెళ్లి చేసుకోలేదు. చదువంతా పూర్తి అయినాక జపాన్ తిరిగివచ్చి, తన తండ్రి హనాను చూసినతర్వాతనే జపాన్‌వారి సంప్రదాయం ప్రకారం పెళ్లి జరిగింది. ముందుగా ఉభయులూ ఇష్టపడితే నేంగాక...అలా నిండుమనసుతో కలిసివచ్చిన పెళ్లి. ఆమె బుగ్గలు అతనిచేతికి ఆనించింది.

ఇలాంటి ప్రసన్నమైన సమయంలోనే ఆ పొగమంచులోంచి ఏదో నల్లటి వస్తువు కొట్టుకొస్తూ కనిపించింది. మనిషే. సముద్ర కెరటాల్లోంచి ఒక్క విసురుతో నిలువునా ఎగసిపడ్డట్టు కనుపించి మళ్లా మంచుతెరలో మాయమైపోయాడు.

"ఎవరది?" హనా అరిచింది. సదావొ చేతిని విడిచిపెట్టేసింది.

ఇద్దరూ వరండా అంచున ఉన్న కమ్మీమీదికి ఒరిగి చూశారు. మళ్లా ఆ శాల్తీ కనపడ్డాడు. ఈమారు వాడి చేతులూ, ముణుకులూ నేలకాని పాకుతున్నట్టు బొక్కబోర్లా పడిపోయాడు.

"జాలరివాడేమో...పడవలోంచి పడి ఒడ్డుకు కొట్టుకొచ్చేశాడు" అన్నాడు సదావొ. వెంటనే మెట్లు దిగి వెళ్లాడు. గౌను చేతి అంచులు రెండూ ఊపుకుంటూ హనాకూడా వెళ్లింది.

ఇటూ అటూ రెండు మైళ్ల దూరం దాటితే జాలరిపల్లె లున్నాయి. ఒడ్డు నిర్మానుష్యంగా ఉంది. పెనుబండల మయం. సముద్రపు నురుగులోకూడా ముళ్లలాగ రాళ్లు. ఆ రాళ్లలోంచి వాడెలాగో కొట్టుకొచ్చేశాడు. ఒళ్లంతా బాగా తెగిపోయి ఉండొచ్చు అనుకుంది. అది అక్షరాలా నిజమని దగ్గరికి వెళ్లగానే కనిపించింది. తడి ఇసుకమీద ఒకపక్క నెత్తుటిజాడ.

"అయ్యయ్యో...గాయపడ్డాడు." సదావొ అరిచాడు.

ఇసుకలో కూరుకుపోయి కదలలేకుండా పడిన శాల్తీవేపుకి హడావిడిగా వెళ్లాడు. ఉప్పునీటిలో బాగా నానిపోయిన పాతటోపీ తలకు బిగిసిపోయి ఉంది. తడిసి పీలికలైన దుస్తుల్లో ఉన్నాడు. సదావొ కిందికి ఒంగి వాడి తలని తిప్పాడు. పక్కనే హనా నిలుచుంది. ఇద్దరూ వాడి మొహంలోకి చూశారు.

**అనువాదం: గిడుగు రాజేశ్వరరావు**

'తెల్లజాతివాడే.' హనా గొణిగింది.

వాడు తెల్లవాడే. తడిసిన టోపీ రాలిపడింది. ఎన్నివారాలుగానో కత్తెరకు నోచని జుత్తు నాని పసుపుపచ్చగా ఉంది. మంచి యౌవ్వనంలో ఉన్నాడు. గాయపడ్డ మొహం. ఏమిచేసినా తెలియనట్టు స్పృహలేకుండా ఉన్నాడు.

సదావొకి వాడి గాయం సంగతి గుర్తొచ్చింది. నైపుణ్యమున్న చేతివేళ్లతో గాయంమూలాన్ని వెదకాడు. ముట్టీముట్టగానే తాజాగా రక్తస్రావం మొదలైంది. వాడి వెన్నుకింద కుడిపక్క తుపాకీతూటా చేసిన గాయంలోంచి నెత్తురు చిమ్ముతోంది. తుపాకీమందువల్ల అక్కడి మాంసఖండం నల్లబడిపోయింది. తుపాకీదెబ్బ తాకి ఎక్కువ రోజులేం కాలేదు. అయితేనేం, దాని కే సంరక్షణా జరగలేదు కదా. సరిగ్గా ఆ గాయంమీదే రాతి సరుకుడుకూడా పడింది.

"అయ్యో...నెత్తురు ధార కట్టేసింది." హనా మెల్లగా అంది.

పొగమంచు అప్పటికి పూర్తిగా మూసివేసింది. జాలరులు ఇళ్లకు వెళ్లిపోయారు. అక్కడ ఎవరూ లేరు. సముద్రపు ఒడ్డున ఎప్పుడూ తిరుగాడుతూ ఆడుక్కునే వాళ్లుకూడా ఇక ఆ రోజు ముగిసినట్టే అని వెళ్లిపోయినట్టున్నారు.

"ఈ మనిషి నేంచేద్దాం?" సదావొ నసిగాడు.

మంచినేర్పుకు అలవాటుపడ్డ అతని వేళ్లుమాత్రం భయంకరంగా స్రవిస్తున్న రక్తాన్ని అరికట్టడానికి ఏంచెయ్యాలో అంతా చేస్తున్నాయి. అక్కడ విస్తారంగా ఉన్న సముద్రపు నాచుతో ఆ గాయాన్ని మూసివేశాడు. ఆ మనిషిమాత్రం మగతలోనే బాధకి మూలుగుతున్నాడు.

"వీణ్ని తిరిగి సముద్రంలోకి దిగవిడవడమే ఉత్తమంలా ఉంది." సదావొ తన ప్రశ్నకే జవాబు చెప్పుకున్నాడు. అలా అప్పటికి రక్తస్రావం ఆగగానే తిన్నగా నిలబడి చేతికున్న ఇసుకను దులుపుకున్నాడు.

"అవును...సందేహం లేదు. అదే ఉత్తమం" అంది హనా స్థిరంగా. కాని, కదలికలేని ఆ మనిషిని తదేకంగా చూస్తూనే ఉంది.

"తెల్లవాడికి మనింట్లో ఆశ్రయమిస్తే మనని నిర్బంధిస్తారు. పోనీ అని వీణ్ణి ఖైదీగా అప్పగించేస్తే చచ్చి ఊరుకుంటాడు." సదావొ అన్నాడు.

"వీడిపట్ల బాగా దయ చూపాలంటే ఇలా నీళ్లలో వదిలెయ్యక తప్పదు." హనా అంది.

కాని, ఎవ్వరూ కదల్లేదు. ఆ కదలికలేని శాల్తీని చిత్రమైన వికర్షణతో చూస్తున్నారు.

"ఎవడు వీడు?" హనా మెల్లగా అడిగింది.

"చూస్తే అమెరికావా డనిపిస్తోంది." సదావొ జవాబు. ఆ నలిగిపోయిన టోపీని అందుకున్నాడు. కనీ కనిపించనట్టు వెలసిన అక్షరాలు ఉన్నాయి.

"నావికుడు...అమెరికా యుద్ధనౌక వాడు...యు.ఎస్. నేవీ" అని పైకి చదివి, "వీడు యుద్ధఖైదీ" అని తేల్చాడు.

"తప్పించుకొచ్చేసి నట్టున్నాడు. అందుకే గాయాలు" అంది హనా చిన్నగా.

"అవును...వెన్నువేపే గాయపడ్డాడు" అన్నాడు సదావొ.

పరస్పరం చూపులు కలుపుకుంటూ ఏదో సందేహించారు.

"ఇద్దరం తిరిగి సముద్రంలో పడవెయ్యగలమా వీణ్ణి." హనా అడిగింది.

"నేను సరే; నువ్వో?" సదావొ ఎదురుప్రశ్న.

"ఊహూఁ...నే వెయ్యను. ఒక్కడివీ..." అంది

హనా.

సదావొ మళ్లీ సందేహించాడు.

"చిత్రమేమిటంటే...వాడంతటవాడు బతికేలా ఉంటే ఏ బాధాలేకుండా పోలీసువాళ్లకి అప్పజెప్పేసేవాడినే. వీడంటే నాకు ఏ జాలీ లేదు. నాకు శత్రువు. అమెరికావాళ్లు నా శత్రువులే. కానీ వీడు సామాన్యుడు. ఎలా అమాయకంగా ఉన్నాడో మొహం చూడు...గాయపడ్డాడుకదా!"

"నువ్వు వాణ్ణి సముద్రంలోకి విడిచిపెట్టలేవు. ఇక ఒకటే దారి. ఇంట్లోకి మోసుకుపోవాలి." హనా అంది.

"మరి పనివాళ్లతో...?" సదావొ ప్రశ్న.

"పోలీసులకి అప్పచెప్పేస్తామని వాళ్లతో చెప్తే సరి. అసలు మనం అదే చెయ్యాలికూడా. సదావొ! మన పిల్లలగురించీ, నీ ఉద్యోగంగురించీ ఆలోచించాలికదా? వీణ్ణి యుద్ధఖైదీగా అప్పగించెయ్యకపోతే మనందరికీ ముప్పే."

"అవునవును...నాకు ఇంకో ఆలోచన లేదు."

అలా ఇద్దరూ సమాధానపడి వాణ్ణి పైకెత్తుకున్నారు. చాలాకాలంగా ఆకలితో చిక్కిశల్యమై ఈకలతో మిగిలిన పిట్టలా తేలిగ్గా ఉన్నాడు. భుజాలు, చేతులు వేలాడిపోతూన్న వాణ్ణి మెట్లమీంచి, ఇంటివక్క ద్వారంలోంచి లోనికి మోసుకుపోయారు. తలుపు తెరచి సన్నని దారిగుండా ఉపయోగంలో లేని పడక గదిలోకి చేర్చారు. ఆ గది సదావొ తండ్రిది. ఆయన పోయాక దాన్ని వాడనే లేదు. ఆ గదిలో చాపలు పరచిన నేలమీద పడుకోబెట్టారు. చుట్టూరా ఉన్న సామగ్రి అంతా జపాను పద్ధతివే. అలా సదావొ తండ్రిని తృప్తి పరచేవాడు. ఆ వృద్ధుడికి విదేశీకుర్చీలో కూర్చోడం, మంచంమీద పడుకోడం బొత్తిగా నచ్చేది కాదు. గోడకున్న సొరుగు తెరచి మెత్తని బొంతను హనా తీసింది. తీస్తూ కొంచెం సందేహించక పోలేదు. సిల్కుపువ్వులు, తెల్లని సిల్కు అంచుతో ఉన్న బొంత అది. "వీడెంత అశుభ్రంగా ఉన్నా డబ్బా" అని గొణిగింది.

"అవును...కడిగితేనే మంచిది. నువ్వు వేడినీళ్లు తెస్తే నేను వీణ్ణి కడిగేస్తాను."

"అబ్బ...నువ్వు వాణ్ణి ముట్టుకున్నా నే ఓర్చుకోలేను. ఇంక పనివాళ్లతో చెప్పకతప్పదు. యుమీని పిలుస్తా. పిల్లల్ని కాసేపు వదలివస్తుంది."

సదావొ ఒక్కక్షణం ఆలోచించాడు. "సరే అలాగే కానీ. నువ్వు యుమీకి చెప్పు. నేనేమో మిగతా పనివాళ్లకి చెప్తాను."

కానీ స్పృహలేకుండా పడున్న వాడి మొహం చూస్తూనే మనసు కరిగింది. ఒంగి నాడి చూశాడు. స్పందిస్తోంది. కాని, చాలా నీరసంగా ఉంది. చల్లటి ఛాతీమీద చెయ్యిపెట్టి చూశాడు. గుండెకూడా కొట్టుకుంటూనే ఉంది. "ఆపరేషన్ చెయ్యకపోతే వీడు చస్తాడు. ఆపరేషన్ తట్టుకోలేకకూడా చావొచ్చనుకో...అది వేరే విషయం."

"వీణ్ణి బతికించే ప్రయత్నం చెయ్యకు...బతికి ఏమిటట." భయంగా అరచింది హనా.

"చస్తేమాత్రం ఏమిటట?" ఇంకా వాడివేపే చూస్తూ అడిగాడు. "వీడిది అసాధారణమైన బలంసుమా...లేకపోతే ఈపరికే చచ్చేవాడు. బాగా చిన్నవయసు. ఇంకా పాతికేళ్లైనా లేవు" అన్నాడు సదావొ.

"అంటే...ఆపరేషన్ చేస్తావా ఏం?" హనా అడగబోయింది.

"హాఁ అవును." హనా సందేహిస్తూ మౌనంగా ఉండిపోగానే, ఇలాగైతే పని సాగ దనుకున్నాడు. "ఎలాగైనా సరే...ఏదో ఒకటి చెయ్యాలి. ముందు వాణ్ణి కడగాలి..." అంటూ గదిబయటకు వెళ్లగానే హనాకూడా వెనకాలే వెళ్లింది.

ఆ తెల్లాడితో గదిలో తా నుండకూడ దనిపించింది. అమెరికానుండి వచ్చాక తెల్లవాణ్ణి అదే ఆమె చూడ్డం. అమెరికాలో ఇదివరలో తను ఎరిగినవాళ్లతో వీడికి సంబంధంలేదని అనిపించింది. వీడు తన శత్రువు...చచ్చినా, బతికినా వీడొక ఆపద.

'యుమీ' అని పనిపిల్లను పిలిచింది. తల్లిగొంతు పిల్లల చెవిని పడిందనగానే ఆమె అటుగా వెళ్లి వాళ్లని చిరునవ్వుతో పలకరించడం, మూడు నెలల చంటివాడితో ఆడడం తప్పలేదు. చంటివాడి తలమీంచి చూస్తూ "యుమీ...ఇలా రా" అంది.

"బాబుని పడుకోబెట్టి వస్తా. పడుకునే వేళకదా." యుమీ అంది.

పిల్లలాడే గదిపక్కనే ఉన్నగదిలో హనా యుమీవెంట వెళ్లింది. చంటివాణ్ణి చేతుల్లోకి తీసి నిల్చుంటే యుమీ పక్కబట్టలు నేలమీద పరిచి పిల్లవాణ్ణి పడుకోబెట్టింది. హనా నెమ్మదిగా వంటగదిలోకి దారి తీసింది.

ఇద్దరు పనివాళ్లు అప్పుడే వాళ్ల యజమాని చెప్పినపనికి భయపడిపోతున్నారు. అక్కడ ఇంటిపనుల్లో సాయంచేసే ముసలి తోటమాలి మరీ మీసాలు పీక్కుంటున్నాడు.

"ఈ తెల్లవాడి గాయాలు మాన్పడంతో యజమాని కేంపని?" అని హనాని మొండిగా అడుగుతున్నాడు. అంతేకాదు. "తెల్లవాడు చావాల్సిందే. వాణ్ణి తుపాకీతో కాల్చేశారు. సముద్రంకూడా గట్టిగానే పట్టి దాని బండలతో కోసి గాయం చేసింది. అటు తుపాకీ, ఇటు సముద్రం చేసిన గాయాల్ని మా యజమాని మానేలా చేస్తే అవి కసి తీర్చుకుంటాయి" అంటున్నాడు.


"సరి సరి...నువ్వేమన్నావో ఆయనకి నే చెప్తాగా." హనా అన్నదేకాని, ముసలాడంత మూఢవిశ్వాసాలు లేకపోయినా, ఆమెకూడా భయపడింది. శత్రువుకి సహాయం చెయ్యడం మంచిదేనా అన్నదే ప్రశ్న. ఏమైనా సరే వేడినీళ్లు పెట్టి తెల్లవాడున్న గదిలోకి తీసుకురమ్మని యుమీతో చెప్పింది.

ఆమె వెళ్లి అడ్డు తడక తొలగించింది. ఇంక అప్పటికి సదావొ రాలేదు. యుమీ కొయ్యబాల్చీ తెచ్చిపెట్టింది. తెల్లవాడికి దగ్గరగా వెళ్లింది. ఆమె పెదవులు మొండిగా బిగుసుకున్నాయి. "నే నెన్నడూ తెల్లవాణ్ణి కడగలేదు. అందులో మరీ ఇంత మురికిగా ఉన్నవాణ్ణి అసలు కడగలేదు" అంది.

"నీ యజమాని చెప్పినట్లు చెయ్యి." హనా గట్టిగా మందలించింది.

"శత్రువుని కడగమని నన్ను నిర్బంధిచడం నా యజమానికి ఏమి న్యాయం?" కరుగ్గా యుమీ జవాబు.

దాని గుండ్రని మొహంలోని ఏవగింపును చూసి హనా భయపడిపోయింది. ఈ పనివాళ్లు ఒకదానికొకటి చెప్తే ఇంకేమైనా ఉందా? కొంప మునగదూ? "విను. వీడికి స్పృహ వచ్చేలాగ చేసి ఖైదీగా అప్పగించేస్తాం తెలుసా?"



"ఏమోనమ్మా! నాకేం తెలీదు. నేనేమో పేద్దాన్ని. ఈ వ్యవహారం నాది కాదు"

"సరే అలాగైతే నీ పనేదో నువ్వు చేసుకో" అంది నెమ్మదిగా హనా.

యుమీ తక్షణమే వెళ్లిపోయింది. ఇంక ఆ తెల్లవాడితో హనా ఒక్కతే మిగిలిపోయింది. అలా ఉండడానికి తను కూడాఎంతో భయపడేదే కానీ తప్పలేదు. వెళ్లిపోయిన యుమీ మీద విసుక్కుంది.

"మతి లేనిది. కాకపోతే, వీడూ మనిషే కదా. అందులోనూ గాయపడ్డ వాడూ, దిక్కులేని వాడూకూడా." ఇలా తనలో పెంచుకున్న ఆత్మబలంతో అనుకోకుండా ఒంగి వాడికి కట్టిన గుడ్డ పీలికల ముడి విప్పింది. గుండె మీద కప్పు తొలగించి, యుమీ తెచ్చిపెట్టిన వేడివేడి నీళ్లలోకి శుభ్రమైన తువ్వాలు ముంచి మొహం అంతా తుడిచింది. గాలీ ధూళీ సోకిన మేర మోటుబారినా వాడి చర్మం సుకుమారంగానే ఉంది. చాలా సొగసైన శిశువుగానే పుట్టి ఉంటాడు.

ఇప్పుడు వాడు శిశువూ కాడు, వాడంటే ప్రత్యేకమైన ఇష్టమూ లేదు. ఇలాటి ఆలోచనల్లో మునిగిపోతూ ఆ శరీరం పైభాగమంతా శుభ్రంగా తుడిచిపెట్టింది. 'ఇంతకీ సదావొ ఎక్కడ?' ఇప్పుడామె కోపం ఉప్పొంగుతోంది. ఏదో ఆత్రుత. లేచి తువ్వాలుతో చేతులు తుడుచుకుని, వాడు చలితో బాధపడుకుండా బొంత కప్పింది.

"సదావొ!" మృదువుగా పిల్చింది.

ఇంతలో తలుపు తెరుచుకుని రానే వచ్చాడు. శస్త్రచికిత్స సరంజామా వున్న సంచితో సర్జన్‌కోటులో కనిపించాడు.

"ఆపరేషన్‌కే తెగించావ్?"

"అవును." వెనుతిరిగి గదిలో ఒకమూల ఎత్తుగా నేల మీద ఉడికించిన తువ్వాలు మడత విప్పి పరిచాడు. కత్తులు పేర్చాడు.

"తువ్వాలు తీసుకురా..." అన్నాడు.

హనా వినయంగా వెళ్లి బట్టల సొరుగుల్లోంచి తువ్వాళ్లు తీసింది. నేలంతా రక్తం మరకలు కట్టకుండా పాత చాప తునకలు ఉండేవుంటాయి కదా అని వెనక వరండాలోకి వెళ్లింది. అక్కడ చలి వైపరీత్యానికి లేత మొలకలు పాడైపోకుండా తోటమాలి పాత చాపలు దాస్తూవుంటాడు. అందులోంచి కొన్ని పట్టుకొచ్చింది.

కానీ తీరా గదిలోకి రాగానే ఇదంతా దండగే అనుకుంది. గాయానికి అద్దిన గుడ్డల్లోంచి నెత్తురు కారి అడుగు చాపను తడిపేసింది. "అయ్యో! చాపంతా..." అని అరిచింది.

"ఆ... పోనీ పాడైతే అయింది. ఇలారా. వీణ్ణి ఇటు పక్కకి ఒత్తిగిలించు" అన్నాడు సదావొ.

మారు పలుకు లేకుండా చెప్పినట్లే చేసింది. అతడేమో ఆ గాయపడ్డవాడి వెన్ను శ్రద్ధగా కడిగివేశాడు.

"యుమీ వాణ్ణి కడిగింది కాదు చూశారా" అంది హనా

"పోనీ నువ్వు కడిగావా?" అని అడిగాడు చకచక చేస్తున్న తన పనిని ఆపకుండా.

"ఆ కడిగాను."

ఆ మాట విన్నట్టే లేడు. పనిలో మునిగిపోతే ఇంక అతని దీక్ష ఎలాటిదో ఆమెకు తెలియని విషయమా? అంత గారాబంగా చికిత్స చేస్తున్న ఆ శరీరం అసలు ఎవడిదన్న సంగతే గుర్తుంటుందా, లేదా అని క్షణం ఆశ్చర్యపోయింది.

"అవసరమైతే మత్తుమందు(ఎనస్తిటిక్) నువ్వు ఇవ్వాల్సి ఉంటుంది."

"నేనా?" ఆలోచించకుండా అంది. "నెనెప్పుడూ ఇవ్వలేదే."

"అదేం కష్టం?" విసుగ్గా అన్నాడు.

గాయానికున్న కట్లన్నీ విప్పుతున్నాడేమో రక్తం మొదటికంటే వేంగా కారిపోతోంది. నుదుటిమీద కట్టుకున్న సర్జన్ దీపపు కాంతిలో గాయాన్ని నిశితంగా చూశాడు.

"బుల్లెట్ ఇంకా అక్కడే ఉంది" కొంచెం ఉత్సుకతతో అనుకున్నాడు. "బండ కూడా ఎంత లోతుగా గాయం చేసిందో చూడాలి. మరీ లోతైన గాయం కాకపోతే బుల్లెట్‌ను లాగెయ్యడానికి వీలౌతుంది. చాలా రక్తమే నష్టపోయాడు. ఈ రక్తస్రావం పైపైది కాదు."

సరిగ్గా అదే సమయంలో హనా డోక్కోబోతున్న సవ్వడి. తలెత్తి ఆమె మొహంలోకి చూశాడు. గంధకం రంగులో ఉంది.

"స్పృహ తప్పిపోతావా ఏం?" అన్నాడే కాని, చేతిలోని పరికరాలేవీ కింద పెట్టలేదు. "ఇప్పుడు నేను పని ఆపుతే వీడు కాస్తా గుటుక్కుమంటాడు."

ఆమె చేతులు రెండూ నోటి కడ్డుపెట్టుకుని ఒక్కఅంగలో గది బయటకి పోయింది. తోటలో ఆమె వాంతి చేసుకుంటున్నట్టు చెవుల పడినా అతని పని మాత్రం ఆగలేదు.

"కడుపులోని దంతా బయటకు రావడమే మంచిది" అన్నాడు. ఎన్నడూ ఆపరేషన్ దగ్గరగా చూడలేదన్న మాట మరిచిపోయాడు. ఒకవేపు భార్య బాధ పడుతోంది. చేతిలోని నాజూకు పనితో లేచి వెళ్లి ఏ సహాయమూ అందించలేని పరిస్థితి. సదావొను చికాకు పెట్టినట్లయింది. తన చేతి కత్తి కిందనే చచ్చినట్టు పడున్న మనిషి మీద విసుగుపుట్టింది.

'వీ డసలెందుకు బతకడం' అనుకున్నాడు. ఈ ఆలోచన తనకు తెలియకుండానే తనలో కరుకుతనం తెచ్చింది. చకచకా తన చేతిలోని పని కానిచ్చేశాడు. మగతలో వున్నవాడు మూలిగాడు. సదావొ మాత్రం చలించలేదు. సణుక్కున్నాడు కూడా.

"మూలుగు...మూలుగు...నీఇష్టం. నా వేడుక కోసం ఇదంతా చెయ్యడం లేదు. అసలెందుకు చేస్తున్నానో నాకే తెలియదు."

తలుపు తెరుచుకుంది. మళ్లీ హనా ప్రత్యక్షం. ఆ చెదిరిన జుత్తు సరిచేసుకోలేదు.

"ఏదీ ఆ మత్తుమందేదో..." స్పష్టమైన గొంతుతో అడిగింది.


సదావొ తన గడ్డంతో సౌజ్ఞచేసి చూపించాడు.

"నువ్వు సమయానికే వచ్చావ్. ఇప్పుడిప్పుడే వీడిలో చలనం వచ్చింది."

ఆమె సీసా, కొంచెం దూది అందుకుంది. "కానీ నేనేం చెయ్యడం?"

"ఏముంది. దూదిని తడిపి వాడి ముక్కుపుటాల దగ్గర పెట్టు." తను చేస్తున్న సున్నితమైన పనికి ఆటంకం రాకుండా చెప్పాడు. "వాడు మరీ ఉక్కిరిబిక్కిరి అయిపోతే కాసింత దూరంగా ఉంచు" అన్నాడు.

అమెరికా యువకుడి మొహానికి దగ్గరగా ఒదిగి కూర్చుంది. పెదవులు బిగుసుకుపోయిన మొహం ఎంత జాలిగా నీరసించి ఉంది అనుకుంది. స్పృహ ఉందో, లేదో కానీ బాధపడుతున్నట్టే ఉన్నాడు. చూస్తూచూస్తూ తను ఇదివరకు ఖైదీల అగచాట్లు గురించి



అప్పుడప్పుడు విన్న కథలు నిజమా అని ఆశ్చర్యపోయింది. ఆనోటా ఈనోటా విన్న మాటలు రకరకాలుగా ఉంటాయి మరి. ఎక్కడెక్కడ జపాను సైన్యాలు అడుగుపెడితే అక్కడి ప్రజలు ఆనందోత్సాహాలతో స్వాగతం చెప్పి వాళ్లకు స్వేచ్ఛ లభించినందుకు మురిసిపోయినట్లే వార్తాపత్రికలు చెబుతూవుంటాయి. కానీ ఒకప్పుడు తన పెళ్లాన్నే ఇంట్లో కొట్టే జనరల్ టకిమా లాంటి వాళ్లుంటారనీ గుర్తు తెచ్చుకుంది. మంచూరియాలో అంత విజయవంతంగా పోరాడినవాడు ఇంట్లో తన భార్య తోటే. క్రూరంగా ఉంటే ఇక ఇలాటి వాడి మీద ఉండడా ఏం? వీడు కూడా చావుదెబ్బలు తినలేదు కదా అనుకుంది. సరిగ్గా అదే సమయంలో మెడమీద లోతైన గాట్లు ఎర్రగా తన కంటబడ్డాయి. సరిగ్గా చెవిక్రిందే.

"ఆ మచ్చలు" అంటూ తలెత్తి సదావొని చూపింది కానీ, అతడి నోట పలుకులేదు.

అదే సమయంలో అతడి చేతిలోని పరికరం చివర్న మూత్రపిండానికి దగ్గరగా ప్రమాదకరంగా ఏదో గట్టి వస్తువు తాటినట్టనిపించింది. అప్పుడు అతడి ఆనందం పరిపూర్ణం. శరీరంలోని అణువణువూ ఎరిగిన ఆ వేళ్లతో పరామర్శించాడు. ఒకనాటి ముసలి అనాటమీ ప్రొఫెసర్ పెట్టిన భిక్షే ఆ పాండిత్యమంతా. "మానవశరీర నిర్మాణం గురించి సమగ్రంగా పరిచయం చేసుకోకపోతే ఏ సర్జనైనా మహాపరాధమే చేస్తాడు" అంటూ ప్రతి క్లాసులోనూ గర్జిస్తూ వుండేవాడు. 'అనాటమీ క్షుణ్ణంగా చదువుకోకుండా శస్త్రచికిత్సకు సిద్ధపడితే ఇక అది కేవలం హత్య. అందుకు సందేహం లేదు' అనేవాడు.

శస్త్రచికిత్సలో పూర్తిగా మునిగి తన్ను తానే మరచిపోయిన సందర్భాల్లో మెల్లమెల్లగా తన చేతిక్రిందున్న రోగితో ఏదో మాట్లాడ్డం సదావొకి అలవాటే.

"అది సరిగ్గా నీ మూత్రపిండం దగ్గరే ఉంది మిత్రమా!" అంటూ చిన్నగా అన్నాడు. అలా అంటున్నప్పుడు ఎదుటివాడు శత్రువన్న ధ్యాస లేనే లేదు. క్షణంలో అవి నైపుణ్యంతో బుల్లెట్‌ను పరిశుభ్రంగా బయటకు తీశాడు. వాడు స్పృహలో లేకున్నా వణికి పోయాడు. ఇంగ్లీషులో ఏదో పలవరిస్తున్నాడు. "అదుగో నా ఆయువుపట్టు...అదే నా ప్రాణం పట్టేశాడు."

"సదావొ!" కీచుగొంతుతో హనా అరిచింది.

"ఉష్! ఉండు..." అన్నాడు సదావొ.

వాడు మళ్లీ ఎంత నిశ్శబ్దంగా ఉలుకూ పలుకూ లేకుండా ఉండిపోయాడంటే సదావొ ఇష్టలేనిదేదో చేస్తున్నట్లుగా చేతి నాడి అందుకుని చూశాడు. నాడి కొట్టుకొంటోంది నీరసంగా. అతి లీలగా వాడి బతుకును నిలిపే ఆశ కల్పించేలా ఉంది ఆ స్పందన.

"నాకెందుకో కానీ వీడు బతకా లనిపించడం లేదు" అనుకున్నాడు.

"ఇక మత్తుమందొద్దు" అన్నాడు హనాతో. చట్టున వెనుతిరిగాడు. చిన్నసూది, మందుసీసా అందుకున్నాడు. దాంట్లోని మందు గాయపడ్డవాడి ఎడమ చేతిలోకి ఎక్కించాడు. సూదిని కిందపెట్టి వాడి చేతినాడిని అందుకున్నాడు. వేలికింద నాడి స్పందించి బలం పుంజుకుంది. "ఇంతైనా కూడా వీడిక బతికేస్తాడు" అంటూ సదావొ గట్టిగా గాలిపీల్చుకున్నాడు.

యువకుడు మేలుకున్నాడు. బాగా నీరసంగా ఉన్నాడు. వాడెక్కడున్నాడో చూసుకోగానే ఆ నీలికళ్లలోని దైన్యం చూసిన హనాకు ఎందుకో క్షమాపణ చెప్పుకోవా లనిపించింది. పనివాళ్లెవరూ గదిలోకి అడుగు పెట్టరాయె. ఇక తనే సంరక్షణ చేసింది. గదిలోకి హనా వచ్చీరాగానే వాడు తనలోవున్న శక్తిని కూడగట్టుకుని ఏదో భయంకరమైన ఆపదకు సిద్ధమోతున్నట్లు కనపడ్డాడు.

"భయపడకు." అనునయపూర్వకంగా అంది.

"మీరు ఇంగ్లీషు మాట్లాడుతున్నారా...అదెలా?" రొప్పుతూ అడిగాడు.

"నేను చాలాకాలం అమెరికాలో వున్నాను."

వా డేదో మాట్లాడాలన్న ప్రయత్నం కనిపించినా మాట పెగల్లేదు. ఆమె మోకాళ్లమీద కూర్చుని పింగాణీ చెమ్చాతో నెమ్మదిగా తినిపించింది. ప్రత్యేకమైన ఇష్టంలేకున్నా కాస్త ఓదార్పుగా ఉండాలన్న ప్రయత్నంతో "ఇప్పుడింక తొందరగా శక్తి వస్తుంది" అంది.

వాడేమీ జవాబు చెప్పలేదు.

000

శస్త్రచికిత్స జరిగిన తర్వాత మూడోరోజు సదావొ వచ్చేసరికి యువకుడు పక్కమీద కూర్చుంటూ కనపడ్డాడు. ఆ శ్రమలో మొహం పాలిపోయి రక్తహీనంగా ఉంది. "పడుకో. నీకు చావాలని ఉందా ఏం?" అంటూ వాడిని తన చేత్తో నెమ్మదిగా పడుకోబెడుతూ గాయాన్ని పరీక్షించాడు.

"ఇలా చేస్తే నిన్ను నువ్వే చంపుకుంటావు" అని మందలించాడు.

"నన్ను ఏం చెయ్యదల్చుకున్నారు?" యువకుడు అడిగాడు.

అప్పుడు చూస్తే పదిహేడేళ్లు నిండినట్టు లేదు వాడి ప్రాయం. "నన్ను పట్టి అప్పగించేస్తారా?"

ఒకక్షణం పాటు సదావొ ఏమీ అనలేదు. తన పరీక్ష పూర్తి కానిచ్చి సిల్కుదుప్పటిని కప్పాడు.

"నిన్ను ఏం చేస్తానో ఇంకా నాకే తెలియదు. పోలీసుల పరం చెయ్యడమే నా కర్తవ్యం. నువ్వు యుద్ధ ఖైదీవి... ఇంకేం చెప్పకు..." అని నోరు మెదపబోతున్న యువకుణ్ణే వారించాడు. "నీ పేరు కూడా నే నడగందే చెప్పకు" అన్నాడు కూడా.

ఒక్క క్షణం ఇద్దరూ పరస్పరం చూసుకున్నారు. ఆ తర్వాత యువకుడు కళ్లు మూసుకుని గోడవైపుకి మొహం తిప్పేసుకున్నాడు.

"సరే" అంటూ పెదవులు వెగటుగా మూసుకుపోయాయి. తలుపు వెనుక సదావొ కోసం హనా ఎదురుచూస్తోంది. ఏదో విపత్తిలో ఉందనిపించింది చూడగానే.

"సదావొ! యుమీ ఏమంటుందో విన్నారా? ఇక్కడ వీణ్ణి ఇలా ఉంచితే మాత్రం పనివాళ్లు ఇక పనిచేసేది లేదట. ఇంకా విను. నువ్వూ, నేనూ అమెరికాలో చాలాకాలం ఉండిపోవటం వల్ల మనదేశం గురించి అసలు ఆలోచనే మరచిపోయామట. మనకి అమెరికా వాళ్లంటే ఇష్టమట."

"అది నిజంకాదు. అమెరికావాళ్లు మనకు శత్రువులు. కానీ నేను రక్షించగలిస్తే ఒక మనిషిని చావ నివ్వకూడదని కదా నేర్పారు."

"పనివాళ్లకి అది అర్థం కాదుకదా" ఆరాటంగా అంది హనా.

"నిజమే..." ఒప్పుకున్నాడు.

(ముగింపు పైవారం)

